క్లుప్తంగా

నేటి నుంచి గ్రంథాలయాల్లో శిక్షణా తరగతులు

ఐ.పోలవరం: ఐ.పోలవరం శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి అంబటి వెంకట నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి వచ్చే నెల 16 వరకూ శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. కథలు, స్పోకెన్ ఇంగ్లిష్, వేదిక్ మ్యాథ్స్, చిత్రలేఖనం, పుస్తక సమీక్షలపై శిక్షణ ఉంటుందన్నారు. సుమారు 40 రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కాపు, దళిత, బీసీ, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం



చేతులు కలిపి సంఘీ భావాన్ని ప్రకటిస్తున్న కాపు, దళిత, బీసీ, మైనార్టీ నాయకులు

అమలాపురం టౌన్: కాపు, దళిత, బీసీ, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం అమలాపురంలోని కాపు నాయకుడు బీఆర్‌కే నాయుడు స్వగృహంలో ఆదివారం జరిగింది. ఈ కులాల మధ్య ఆత్మీయతా స్నేహ భావం పెంపొందించేందుకు ఆయా కులాల ప్రతినిధులు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అంతా చేతులు కలిపి సంఘీ భావాన్ని ప్రకటించారు. కోనసీమ రైల్వే లైను కోసం కలిసికట్టుగా ముందుకెళ్లాలని తీర్మానించారు. సమావేశంలో నల్లా విష్ణుమూర్తి, వర్ధినీడి నరింహారావు, వడ్డి నాగేశ్వరరావు, డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు, రాయుడు రమణ, మొల్లేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

9, 10 తేదీల్లో తుమ్మలపల్లిలో గడప గడపకూ..

అల్లవరం: ఈ నెల 9, 10 తేదీల్లో తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ నిర్వహించనున్నారని ఎంపీడీఓ జి.సరోవరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొంటారన్నారు.

హెచ్ఐవీ చిన్నారులకు పౌష్టికాహార కిట్లు అందజేత

అమలాపురం టౌన్: స్థానిక వంటిద్దువారి వీధిలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటిద్దు వెంకన్నాయుడు జన్మదినం సందర్భంగా దాదాపు 100 మంది బాధిత చిన్నారులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జన కళ్యాణ్ శ్రీనివాస్, ఆకుల బాలాజీ, చీకట్ల చిన్ని, నల్లా హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్‌కు సన్మానం



చెయ్యేరులో వీఎఫ్ఏ సురేష్‌ను సన్మానిస్తున్న ఆక్వా రైతులు

కాట్రేనికోన: మండలంలోని చెయ్యేరు విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గాలిదేవిర సురేష్‌ను ఉమా రామలింగేశ్వర ఆక్వా సంఘం ఆధ్వర్యంలో ఆక్వా రైతులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆక్వా సంఘ గౌరవాధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ ఈ–ఫిష్ సర్వేలో 90 శాతం మంది రైతులకు కరెంట్ సబ్సిడీ వచ్చేందుకు కృషి చేసిన ఫిషరీస్ జేడీ లాల్ మహ్మద్, మత్స్యశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆక్వా రైతులు చవటపల్లి శ్రీను, నంద్యాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆబోతుకు శస్త్రచికిత్స



ఆబోతుకు శస్త్రచికిత్స చేస్తున్న పశువైద్యులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీగౌతమి మహర్షి గోసంరక్షణ గోశాలలో ఓ ఆబోతుకు గాయమై పక్కటెముకలు ఇన్‌ఫెక్షన్‌కు గురైన చోట రంధ్రం ఏర్పడింది. గోశాల నిర్వాహకులు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనం(అంబులెన్స్) 1962కి ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో ఆబోతును అంబులెన్స్‌లో స్థానిక పశు వైద్యాలయానికి తరలించి పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి, డాక్టర్ చీకట్ల వెంకట నారాయణల ఆధ్వర్యంలో పశు వైద్యులు డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ హెబ్సిబాలు శస్త్రచికిత్స చేశారు. చికిత్స అనంతరం ఆబోతును తిరిగి అంబులెన్స్‌లో తీసుకుని వెళ్లి గోశాలలో దించారు. కార్యక్రమంలో గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, గొవ్వాల అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి.. అవస్థలే..

- తీర గ్రామాల్లో దయనీయ స్థితిలో శ్మశాన వాటికలు
- చిన్నపాటి వర్షానికే మునక.. కనీస సదుపాయాలు కరవు



ముళ్లపొదల్లో దొమ్మేటిపేట శ్మశానవాటిక



పిచ్చిమొక్కలతో మెట్టకూరు శ్మశానవాటిక

యానాం: బెంజి కారులో తిరిగేవాడైనా.. గంజి తాగి బతికేవాడైనా చివరికి మృత్యుఒడికి చేరుకోవాల్సిందే.. చనిపోయింది నిరుపేదైనా, సంపన్నుడైనా తమ ఆత్మీయుల్ని గౌరవంగా సాగనంపాలని వారి కుటుంబసభ్యులు భావిస్తారు. అయితే అంతిమ సంస్కారాలు నిర్వహించే శ్మశానవాటికలు చిన్నపాటి వర్షానికే మునిగిపోతుంటే, రుద్రభూమికి వెళ్లే దారులన్నీ ముళ్ల కంపలతో నిండిపోతుంటే, ఆఖరికి అక్కడ కనీస సదుపాయాలూ కరవైతే వారెంత మానసిక క్షోభను అనుభవిస్తారు...? యానాంలోని తీర ప్రాంత గ్రామాల్లోని రుద్రభూముల్లో ఇలాంటి దయనీయ పరిస్థితులే ఉండడంతో అక్కడి ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం

తీర గ్రామాల్లో శ్మశానవాటికలు అభివృద్ధికి నోచుకోలేదు. కనీస సౌకర్యాలు లేక అంత్యక్రియలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రుద్రభూమి తుప్పలు, ముళ్ల కంపలు, చెత్తతో నిండిపోయి ఉన్నా సంబంధిత పీడబ్ల్యూడీ సిబ్బంది సైతం పట్టించుకోవడం లేదు. దీంతో స్థానిక యువకులే శ్రమదానంతో శుభ్రం చేసుకోవాల్సి వస్తుంది. అంతేకాదు వర్షాలొచ్చినపుడు అనేక శ్మశానవాటికలు ముంపుబారిన పడుతుండడంతో ఆఖరి మజిలీకి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు కనీసం కాళ్లు కడుక్కోవడానికి కూడా నీళ్లు లేక మృతుల కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి వేళల్లో ఎవరైనా మరణిస్తే శ్మశానవాటికల్లో లైట్లు లేక చీకట్లోనే అంత్యక్రియలు చేయాల్సి వస్తోంది. ఎన్ని సమస్యలున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

అధికారుల నిర్లక్ష్యానికి ఆనవాళ్లివీ

- నియోజకవర్గ శివారున ఉన్న సావిత్రినగర్ మత్స్యకార గ్రామ శ్మశానవాటికకు వెళ్లడానికి సరైన రహదారి లేదు. అంతేకాదు భారీవర్షాలు వచ్చిన ప్రతిసారి శ్మశానం మునిగిపోతుంది. రాత్రి వేళల్లో విద్యుత్‌దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక యువత అధ్యక్షుడు మల్లాడి రాజు ఆవేదన వ్యక్తం చేశారు.
- గోదావరి ఒడ్డున ఉన్న ఎస్సీ గ్రామం దొమ్మేటిపేటకు ఒక సెంటు భూమిలో శ్మశానవాటిక ఉంది. కాని అక్కడకు వెళ్లడానికి కనీస దారి లేదు. పైగా ఉన్నదే కాసింత అనుకుంటే దాంట్లోను ముళ్ల పొదలు నిండిపోయి ఉంటున్నాయి. ఇదీ గోదావరికి వరదలొచ్చిన ప్రతీసారి మునిగిపోతుంది. శ్మశానవాటికను మట్టితో చదును చేసి రహదారి వేయించాలని స్థానిక గ్రామస్తులు ఏళ్లుగా కోరుతూనే ఉన్నారు.
- భీమ్‌నగర్ దళితుల శ్మశానవాటికను భీమ్‌నగర్, వికాస్‌కోలనీ, సిద్ధార్థనగర్, యూకేవీనగర్ గ్రామస్తులు ఉపయోగించుకుంటుంటారు. వర్షాలొస్తే చాలు శ్మశానవాటిక మునిగిపోతుంది. ఇక్కడ కనీస సౌకర్యాలు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నా పట్టించుకునేవారు లేదు.
- యానాం పట్టణంలోని దాదాపు సగం గ్రామాలకు చెందిన వారు మెట్టకూరు శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహించుకుంటారు. శ్మశానవాటిక ఎప్పుడూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతోనే దర్శనమిస్తుంది.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



దొమ్మేటిపేట శ్మశానవాటికలో కనీస సదుపాయాలు కరవయ్యాయి. గోదావరికి వరదలొచ్చినా, భారీవర్షాలు వచ్చినా శ్మశానవాటిక మునిగిపోతుంది. రహదారి, విద్యుత్, తాగునీరు లేవు. అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.
– జనిపల్లి వెంకన్నబాబు, దొమ్మేటిపేట

వైభవోపేతం... వేంకటేశుడి దివ్య కల్యాణం



బండారులంకలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరుని కల్యాణం



వెంకన్న కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణం శనివారం రాత్రి వైభవోపేతంగా నిర్వహించారు. స్థానిక బిళ్ల వారి వీధిలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై భక్తుల గోవింద నామస్మరణ, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం జరిపారు. స్వామివారి తరఫున వేద పండితులు, దేవేరుల తరఫున భక్తులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు ముత్యాల తలంబ్రాలు, రూరల్ ఎస్ఐ అందే పరదేశి పట్టు వస్త్రాలు, పీఏసీఎస్ చైర్మన్ దంగేటి బుల్లబ్బులు దంపతులు మంగళ సూత్రాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్మన్ కుడిపూడి సత్య శైలజ, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ పిచ్చికి శాంతి ప్రభాకర్, కౌన్సిలర్లు దొమ్మేటి రాము, మధు గొవ్వాల రాజేష్, రుద్రరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళులు



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



జార్జిపేటలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి ముమ్మిడివరం మండలం చిన కొత్తలంకలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి నిలువెత్తు శిలా విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తలంక సొసైటీ అధ్యక్షుడు పీటీవీ వర్మ, పి.ఉదయ భాస్కరవర్మ, పీవీవీఎస్ వర్మ, పి.కాశీ శ్వనాథరాజు, ఎం.గణేష్‌వర్మ, పీవీ నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండల పరిధిలోని జార్జిపేటలో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజుల కాలనీలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పుల్లెపు చారిటబుల్ ట్రస్ట్ అధినేత పుల్లెపు వెంకటేశ్వరరావు, కాకినాడ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, తుపాకుల ప్రసాదరావు, బులిరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిట్టూరి కలికిమూర్తి, పబ్బినీడి శ్రీనివాసకుమార్, గంటా గోపి, కోలాటి వీరబాబు, నడింపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

యువతకు అల్లూరి స్ఫూర్తిదాయకం

యానాం: స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఫెర్రీ రహదారిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్, ఎస్ఐ శేరు నూకరాజు, మున్సిపల్ ఏఈ ఎం.రామలింగమూర్తి, క్షత్రియ పరిషత్ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నిండుకుండల్లా తాగునీటి చెరువులు

ఎమ్మెల్యే అశోక్ చొరవతో సమస్యకు పరిష్కారం



నిండుకుండలా మారిన తాగునీటి చెరువు

యానాం: యానాం ప్రజలకు తాగునీరందిస్తున్న రెండు భారీ తాగునీటి రిజర్వాయర్ చెరువుల్ని ఆదివారం సైతం పూర్తిస్థాయిలో నింపడంతో ఈ వేసవిలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించినట్టైంది. నియోజకవర్గ పరిధిలో పట్టణ వాసులతో పాటు, శివారు తీరప్రాంత గ్రామాలకు సైతం ఈ చెరువుల నుంచే తాగునీరందుతుంది. కొద్దిరోజుల క్రితం చెరువుల్లో నీరు అడుగంటడంతో అందరూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఇంజినీరింగ్ బృందంతో కలిసి కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీరును కలిసి తాగునీటి చెరువులు నింపుకునేలా తమకు వంతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఫ్రెంచి కెనాల్ నుంచి నీటిని తరలించేవిధంగా ఆర్ఏఓ మునిస్వామి ఆధ్వర్యంలో పిల్లంక వద్ద క్రాస్‌బండ్ వేసి నీటిని మళ్లిస్తున్నారు. దీంతో తాగునీటి చెరువులు జలకళతో నిండుకుండల్లా మారాయి.

నేడు పోలేరమ్మ జాతర

రాయవరం: వెదురుపాక గ్రామ దేవతగా అలరారుతున్న పోలేరమ్మ జాతర సోమవారం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఏటా వైశాఖ మాసంలో అమ్మవారి జాతరను నిర్వహించడం పరిపాటి. అమ్మవారి జాతరలో భాగంగా బ్యాండ్ మేళాలు, గరగనృత్యాలు, గారిడీ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. మంగళవారం ఉదయం అమ్మవారి తీర్థం జరగనుంది.

ముగిసిన సత్యసాయి బాల వికాస్ వారోత్సవాలు



అమలాపురం పుర వీధుల్లో ర్యాలీ చేస్తున్న సత్యసాయి బాల వికాస్ విద్యార్థులు

అమలాపురం టౌన్: అమలాపురం డివిజన్ శ్రీసత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో గత వారం రోజులుగా స్థానిక సత్య సాయి కల్యాణ మండపంలో జరుగుతున్న బాల వికాస్ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. తొలుత బాలవికాస్ విద్యార్థులు ఓం కారం, సుప్రభాతంతో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ప్లకార్డులు చేతబట్టి పుర వీధుల్లో ర్యాలీ చేశారు. కోలాటం, శాస్త్రీయ నృత్యం, సత్యసాయి పాటలు, అమ్మపై నాటకం, విచిత్ర వేషధారణలతో చిన్నారులు అలరించారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల విజేతలకు జిల్లా ప్రతినిధులు బహుమతులు అందజేశారు. జిల్లా బాల వికాస్ మహిళా కో ఆర్డినేటర్ భవాని నీతి కథలు, చిన్నారుల్లో పరివర్తన అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాల వికాస్ కో ఆర్డినేటర్ గుణ రంజన్, సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కొండబాబు, సంస్థ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మంత్రి అభినందనలు



దేవినాగశ్రీని అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: పదో తరగతిలో 581 మార్కులు సాధించిన బండారులంక ఉన్నత పాఠశాల విద్యార్థిని చింతపట్ల దేవినాగశ్రీని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ భట్నవెల్లిలోని తన నివాసంలో ఆదివారం పుష్పగుచ్ఛంతో అభినందించారు. దేవినాగశ్రీ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు కాలేపు శ్రీనివాస్, దంగేటి రుద్ర, జాన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న గురుకుల పాఠశాల సమన్వయకర్త మురళీకృష్ణ తదితరులు

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులను అధికారులు అభినందించారు. చొల్లంగిపేటలోని పాఠశాలలో ఆదివారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 555 మార్కులు సాధించిన పి.నీరిష, 530 మార్కులు సాధించిన వై.అనూష, 528 మార్కులు సాధించిన ఎస్.స్వాతిలను ఏఎంఓ సంజీవరావు, జిల్లా సమన్వయకర్త ఎ.మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ పి.పద్మావతి తదితరులు అభినందించి, వారు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఆచార్య ఆత్రేయకు ఘన నివాళి



ఆత్రేయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: మనసు కవి ఆచార్య ఆత్రేయ జయంతి సభ స్థానిక శెట్టిబలిజ గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సంస్థ, శ్రీ కళా వేదిక జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆచార్య ఆత్రేయ రాసిన పాటలు, కథలు, నాటకాలన్నీ ఆయన జీవితాన్ని ఏదో సందర్భంలో ప్రతిబింబించిన అంశాలేనని సూర్యనారాయణరావు అన్నారు. తొలుత ఆత్రేయ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యోగా ఆరోగ్య సంస్థ కార్యదర్శి నల్లా నరసింహమూర్తి, శ్రీశ్రీ కళా వేదిక కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు చిక్కాల రవి శంకర్, వాకర్స్ గున్నేపల్లి భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యం



ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు

తాళ్లరేవు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యమిచ్చి అనేక ఉన్నత పదవులను కేటాయించిందని ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. సుంకరపాలెం శంకర్ రెసిడెన్సీలో యానాం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను సంఘ ప్రతినిధులు దుశ్శాలువాలు, పూల మాలలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ శెట్టిబలిజలకు గతంలో ఏ పార్టీ ఇవ్వని గుర్తింపును వైఎస్సార్‌సీపీ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చీకట్ల సత్యనారాయణ, గుత్తుల జయరామారావు, మట్టపర్తి లోవరాజు, మేడిశెట్టి రామలింగేశ్వరరావు, కాకి నాగేశ్వరరావు, పిల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



శిక్షణ పొందిన క్రీడాకారులతో ఏఆర్ డీఎస్పీ విజయసారథి

అమలాపురం రూరల్: స్థానిక ఎస్‌కేబీఆర్ కాలేజ్‌లో ఆంధ్రప్రదేశ్ సేపక్ తక్ర వేసవి శిక్షణా శిబిరాన్ని ఏపీ బెటాలియన్ ఏఆర్ డీఎస్పీ విజయసారథి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రీడల్లో సేపక్ తక్ర క్రీడ ఒకటన్నారు. అనేక మందికి ఈ క్రీడ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందారన్నారు. ఈ క్రీడను జిల్లాలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్న ఏపీ పోలీస్ టీం కోచ్ యాండ్ర గౌతమ్, కేతా సతీష్‌లను ఆయన అభినందించారు. క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ వరకూ శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లిబోయిన శ్రీనివాసరావు, వాసంశెట్టి సుభాష్, మట్టపర్తి మురళీకృష్ణ, కళాశాల పాలక మండలి అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ సురేష్, పీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని విజయవంతం చేయండి

కాట్రేనికోన: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 11 వరకూ నాలుగు రోజుల పాటు కాట్రేనికోన, కందికుప్ప గ్రంథాలయాల్లో నిర్వహించనున్న వేసవి విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని కాట్రేనికోన గ్రంథాలయ అధికారిణి తులసి లక్ష్మి పిలుపునిచ్చారు. వేసవి శిబిరంలో రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ కథలు, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్ వంటివి నేర్పిస్తారని చెప్పారు.

ఎక్స్‌రే మిషన్ పనిచేయడం లేదని ఫిర్యాదు

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్‌రే యంత్రం సరిగ్గా పనిచేయక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థాని దినేష్ జీజీహెచ్ డీడీ రవిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆయన ఎక్స్‌రే విభాగానికి వెళ్లి ఎక్స్‌రే మిషన్‌ను పరిశీలించారు. పనిచేయని యంత్రంతో తూతూమంత్రంగా ఎక్స్‌రే తీసి రోగులను పంపించేస్తున్నారని, వాటిని వైద్యుల వద్దకు తీసుకెళ్తే మళ్లీ తీయించాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎక్స్‌రే కోసం రోగులు కాకినాడ వెళ్లాల్సిన దుస్థితిని ఎదుర్కోవడం దారుణమన్నారు. ఈ సమస్యపై ఎంపీ వైద్యలింగం, ఎల్జీ తమిళిసై సౌందరాజన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

సత్యనారాయణస్వామి ముగింపు ఉత్సవాలు

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడిలో శ్రీరామసమేత వీరవెంకట సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మాజీ వైస్ ఎంపీపీ అరిగెల సుబ్రహ్మణ్యేశ్వరరావు, శ్రీదేవి దంపతులచే పుష్పోత్సవం నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో ఆదివారం పూర్ణాహుతి, అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అరిగెల బాబి, ఆర్వీ నాయుడు, రంకిరెడ్డి రామలింగేశ్వరరావు, అరిగెల నాని, అరిగెల సుబ్బరాజు పాల్గొన్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా బుజ్జి దొర



జిల్లా ఒకేషనల్ కళాశాల యాజమాన్యాల సంఘ నూతన కార్యవర్గం

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఒకేషనల్ జూనియర్ కళాశాల యాజమాన్యాల సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఎ.బుజ్జి దొర ఎన్నికయ్యారు. స్థానిక శాంతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం జిల్లా ఒకేషనల్ కళాశాల యాజమాన్యాల సంఘం ఏర్పాటైంది. కార్యదర్శిగా కుడిపూడి జగదేష్, కోశాధికారిగా గుత్తుల విజయకుమార్, కార్యనిర్వహణ సభ్యులను ఎన్నుకున్నారు. పాత పద్ధతిలోనే ట్యూషన్ ఫీజు విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేవరపల్లి శాంతి కుమార్, అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షుడు బొంతు బాలరాజు, జవ్వాది నాగేశ్వరరావు, దొమ్మేటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ప్రవీణ్ చంద్



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో కడప మున్సిపల్ కమిషనర్, ఐఏఎస్ ప్రవీణ్‌చంద్ దంపతులు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని కడప మున్సిపల్ కమిషనర్, ఐఏఎస్ గోకరకొండ ప్రవీణ్‌చంద్ దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రవీణ్‌చంద్ దంపతులకు ఆలయ వేదపండితు వేదాశీర్వాదం పలికారు. స్వామి వారి విశిష్టతను వివరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన స్వామివారి నిత్యాన్నదాన సత్రానికి రూ.10,116 విరాళంగా అందజేశారు.